వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పల్లవి ప్రతిభ



నెల్లిమర్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రం లోని డెహ్రాడూన్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన క్రీడాకారిణి ఎస్.పల్లవి 71 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించారు. స్నాచ్‌లో 94 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 118 కిలోలు మొత్తం 212 కిలోలు బరువు ఎత్తి పల్లవి బంగారు పతకం సాధించినట్లు కోచ్ చల్లా రాము తెలిపారు. పల్లవిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోషల్ మీడియా వేదికగా అభినందించారు.

150 గజాల వరకు ఉచితం



● ఆక్రమిత స్థలాల్లో ఇళ్ల క్రమబద్ధీకరణ ● పట్టా మాత్రం మహిళల పేరున జారీ
● 2019 అక్టోబరు 15కి ముందు వారికి లబ్ధి
● డిసెంబరు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ ● ఉత్తర్వులు జారీ చేసిన సీసీఎల్ఏ

ప్రభుత్వ భూముల్లో నిర్మాణం చేపట్టిన యజమానులకు శుభవార్త. ఆ ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం వచ్చింది. వాటికి రెండేళ్ల తరువాత యాజమాన్యపు హక్కులను కల్పించనుంది. 150 గజాల వరకు ఉచితం. అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో వున్న నిర్మాణాలకు మాత్రం ప్రభుత్వం సూచించిన రుసుం చెల్లించాలి. పట్టాను మహిళల పేరున అందించనుంది. 2019 అక్టోబర్ 15 కంటే ముందు భూమి ఆక్రమించి నిర్మాణాలను చేపట్టిన వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించనుంది. ఈమేరకు రాష్ట్ర భూ పరిపాలన శాఖ (సీసీఎల్ఏ) ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

శృంగవరపు కోట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తెలిసో తెలియకో నీడ కోసం కొంత మంది ప్రభుత్వ భూములను ఆక్రమిస్తుంటారు. వాటిల్లో గృహ నిర్మాణాలను చేపడుతుంటారు. అలాగే ప్రభుత్వ భూమిని కలుపుకొని తీర్చిదిద్దిన లేవుట్‌లో భూమిని కొనుగోలు చేసి తీరా నిర్మాణం చేపట్టాక ప్రభుత్వ భూమి అని తెలిసి టెన్షన్ పడుతుంటారు. ఇలాంటి వారు జిల్లా వ్యాప్తంగా ఉన్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఆక్రమ నిర్మాణాలు వందల్లో కాదు వేలల్లో ఉన్నాయి. వాటిని క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వం చెప్పినంత సొమ్మును చెల్లించేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారు. ఈ సమస్యపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. అర్హులైన వారికి న్యాయం చేయాలని భావిస్తోంది. గత మంత్రి వర్గ సమావేశంలోనే ఈ నిర్ణయం తీసుకుంది.

ఆ భూములకు వర్తించదు

ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణలో కొన్ని రకాల భూములకు మినహాయింపులు ఉన్నాయి. తాగు, సాగునీటి వనరులకు సంబంధించిన భూములు, గ్రీన్ బెల్ట్‌లు, వాగు, గెడ్డపోరం బోకు భూములు, జాతీయ రహదారులు, రాష్ట్రంలోని మేజర్ రహదారుల పక్కనున్న భూములు,రోడ్డు విస్తరణకు అవసరమైన భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించరు. అభ్యంతకర భూములు గా గుర్తించిన వాటిల్లో ఎటువంటి నిర్మాణాలైనా ఆమో దించరు. అంతేకాకుండా లబ్ధిదారులు ఆదాయ పన్ను చెల్లింపుదారులుగా ఉండకూడదు. నాలుగు చక్రాల వాహ నం ఉన్నా క్రమబద్ధీకరణకు అనర్హులవుతారు. వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్న ట్యాక్సీ, ఆటో, ట్రాక్టర్లకు మినహాయింపు ఉంది.

క్రమబద్ధీకరణ ప్రక్రియ ఇలా..

151 - 300, 301- 450, 451 గజాలు పైబడి జరిగిన ఇంటి నిర్మాణాలను అనుసరించి ప్రభుత్వం విధించిన రుసుం చెల్లించాలి. అయితే దారిద్ర్యరేఖకు దిగువన వున్న కుటుంబాలకు ఒక రకంగాను (మిగతా 8వ పేజీలో..)

సూర్య నారాయణాయ





స్వామి దర్శనానికి వెళ్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వరరెడ్డి

● అరసవల్లిలో నేత్రపర్వంగా ఆదిత్యుడి క్షీరాభిషేకం
● దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. శ్రీకాకుళం జిల్లా అరసవల్లి భక్తజన సంద్రమైంది. తొలిసారి రాష్ట్ర పండుగగా సాగిన.. 'రథసప్తమి' వేడుక అంబరాన్ని తాకింది. ఆరోగ్య ప్రదాతను కనులారా వీక్షించేందుకు జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు.. ఆలయ ప్రాంగణం అంతటా సూర్యనామం మార్మోగింది. సోమవారం అర్ధరాత్రి క్షీరాభిషేకంతో ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం రాత్రి వరకూ కొనసాగాయి. సామాన్య ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు.

అరసవల్లి/విజయనగరం/విజయనగరం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అరసవల్లి ఆదిత్యుడి నిజ రూపాన్ని(అరుణశిల) దర్శించుకుని భక్తజనం పులకించింది. ఆలయ ప్రాంగణం అంతటా.. ఓం భాస్కరాయనమః నామస్మ రణతో మార్మోగింది. కూటమి ప్రభుత్వం 'రథసప్తమి'ని రాష్ట్ర పండుగగా ప్రకటించగా.. ఆదివారం నుంచి మూడు రోజులపాటు వేడుకలు వైభవంగా సాగాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి క్షీరాభిషేకం ప్రారంభం కాగా.. ఆదిత్యుడ్ని లక్షలాది సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి 11 గంటల వరకూ భక్తుల సందడి కనిపించింది.

జిల్లాలోనూ రథసప్తమి వేడుకలు

విజయనగరం జిల్లా ప్రజలు రథసప్తమిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. సూర్యోదయం నాటికే స్నానాది కార్యక్రమాలు ముగించుకుని కర్రల పొయ్యిపై ప్రసాదాన్ని వండి అక్కడే పూజలు నిర్వహించి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఇటు ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయనగరంలోని శివ పంచాయతన ఆలయ సముదాయంలో ఉన్న సూర్యభగవానుడి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రామతీర్థంలో రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పైడిమాంబ చదురుగుడి, వనంగుడిలోనూ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అమ్మవారిని అలంకరించారు.



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి

ముగ్గురి నామినేషన్

● రెండు సెట్లు దాఖలు చేసిన సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ



రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రఘువర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ రెండు సెట్లు, మాజీ ఎంఈవో ఎస్.ఆర్.పద్మావతి, సెయింట్ జోసెఫ్ కళాశాల రిటైర్డు ఆచార్యుడు కోసూరు రాధాకృష్ణ ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు సమర్పించారు. రఘువర్మ వెంట ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీటీఎఫ్ మద్దతుదారులు ఉన్నారు. నామినేషన్ దాఖలుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని సహాయ రిటర్నింగ్ అధికారి బీహెచ్ భవానీశంకర్, నోడల్ అధికారి దయానిధి, ఇతర సిబ్బంది అందించారు. నామినేషన్ పత్రాల దాఖలుకు అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే అనుమతించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిఘా నీడలో పరీక్షలు జరగనున్నాయి. బుధవారం నుంచి ఈ నెల 19 వరకూ పరీక్షలు కొనసాగుతాయి. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, అలాగే మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకూ రెండు ధపాలు జరగనున్నాయి. ఈనెల 5,6,7 తేదీల్లో ఒకేషనల్ విద్యార్థులకు, 10 నుంచి 19 వరకూ జనరల్ గ్రూపుల విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. జనరల్ గ్రూపుల విద్యార్థులు 73 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ప్రతి విద్యార్థి పరీక్ష కేంద్రానికి అరగంట ముందు హాజరుకావాల్సి ఉంది. ఉదయం 8.30కు ఆన్‌లైన్‌లో ప్రశ్న పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక డిపార్టమెంట్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎటువంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేశాం. ప్రతి విద్యార్థి పరీక్ష కేంద్రానికి 8.30కు చేరుకోవాలి. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్షలను పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా స్క్వాడ్‌లను కూడా నియమించాం.

- మజ్జి ఆదినారాయణ, ఆర్ఐవో

పోలీసు శిక్షణ కేంద్రంలో మౌలిక వసతులు కల్పిస్తాం

● ఎస్పీ వకుల్‌జిందాల్



డీటీసీ వంటగదిని పరిశీలిస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సారిపల్లి పోలీసు శిక్షణ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. పోలీసు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలీసు కానిస్టేబుళ్ల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచే శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. తరగతి గదులు, కార్యాలయం, వంటగది, డైనింగ్ హాల్, మినరల్ వాటర్ ప్లాంట్, వాష్‌రూంలను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. శిక్షణ కేంద్రంలో మంచాలు, పరుపులు, క్రీడాసా మగ్రి, కంప్యూటర్ల పనితీరు గురించి డీటీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా మంచినీటి సమస్య వుందని ఎస్పీ దృష్టికి తీసుకురాగా నీటి వసతిని కల్పించేందుకు నగరపాలక సంస్థ అధికారులతోనూ, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, జి.రామకృష్ణ, డీటీసీ అధికారులు ఉన్నారు.

● ముఖ్యవ్యక్తుల భద్రతలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. భద్రతా విధులు నిర్వహించే పీఎస్‌ఓల ఫైరింగ్ ప్రాక్టీస్‌ను పర్యవేక్షించారు.



పందిరిరాటకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి దంపతులు

రామతీర్థంలో ఘనంగా పందిరిరాట

నెల్లిమర్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 8న జరుగనున్న సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. దేవస్థానం అర్చకులు పందిరి రాట తంతు నిర్వహించారు. ఏటా భీష్మ ఏకాదశి నాడు జరిగే ఈ కల్యాణానికి రథసప్తమి నాడు పందిరిరాట వేయడం ఆనవాయితీగా వస్తున్నది. దేవస్థానం ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఖండవిల్లి కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పవన్, రామ్‌గోపాల్ తదితరులు ఈ ప్రక్రియను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కాగా రథసప్తమిని పురస్కరించుకుని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, జనసేన నాయకుడు లోకం ప్రసాద్ దంపతులు మంగళవారం దేవస్థానాన్ని సందర్శించారు. సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్లీజ్.. ప్రాణం నిలపండి



● రోడ్డు ప్రమాదాల్లో మొదటి గంటే కీలకం
● క్షతగాత్రుడ్ని సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్తే రూ.25వేల బహుమతి
● ప్రమాదాలు తగ్గించేందుకు గుడ్ సమరిటన్ ● ప్రచారంలో లేని కేంద్ర ప్రభుత్వ పథకం



రాజాం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కళ్లముందు ప్రమాదం జరిగింది.. క్షతగాత్రులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. కానీ వారిని కాపాడేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు.. క్షణాల్లో ఆసుపత్రిలో చేర్పించాలన్న ఆలోచన ఉన్నా.. భవిష్యత్తులో కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందేమో, కోర్టుల చుట్టూ తిరగాలేమోనన్న అనుమానం.. భయం వెంటాడే పరిస్థితి. ఇలాంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం గుడ్ సమరిటన్ పథకం తీసుకువచ్చింది. క్షతగాత్రుల్ని తక్షణమే ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడేలా చేసిన వారికి రూ.5 వేలు ప్రోత్సాహకం ప్రకటించి అమలు చేసింది. తాజాగా ఆ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం రూ.25 వేలకు పెంచింది.

ఇదిగో ఉదాహరణ

రాజాం-శ్రీకాకుళం రోడ్‌లో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఇటీవల ఎదురుగా వస్తున్న లారీని రాంగ్ రూట్‌లో వెళ్లి ఢీకొన్నాడు. క్షణాల్లో తుప్పల్లోకి ఎగిరిపడిపోయాడు. రాత్రి 9 గంటల సమయం కావడంతో పెద్దగా జన సంచారం లేదు. పదినిమిషాల వ్యవధిలో జనం గుమిగూడారు.. అయ్యో.. అంటూ నిట్టూర్పు విడిచారే తప్ప ప్రమాదానికి గురైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి చెందాడని కొందరు (మిగతా 8వ పేజీలో..)

కేసుల భయం అవసరం లేదు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తుల్ని ఆసుపత్రికి తరలిస్తే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందన్న అపోహలు వద్దు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆసుపత్రికి తరలించినా, అంబులెన్స్‌కి సమాచారం ఇచ్చినా పోలీసుల నుంచి ఇబ్బందులుండవు. రోడ్డు ప్రమాద కేసులకు సాక్షులుగా ఉండాల్సిన అవసరం లేదు.

- కె.అశోక్‌కుమార్, సీఐ, రాజాం టౌన్

కుటుంబాన్ని కాపాడినట్లే

క్షతగాత్రుల్ని సకాలంలో ఆసుపత్రికి తీసుకువస్తే.. ఒకరి ప్రాణమే కాదు.. అతని కుటుంబం రోడ్డున పడకుండా కాపాడినవారవుతారు. అలాంటి వారిని ప్రభుత్వం ప్రాణదాతగా గుర్తించి ప్రశంసాపత్రంతో పాటు ప్రోత్సాహక నగదు కూడా అందజేస్తుంది.

- కరణం హరిబాబు, సూపరింటెండెంట్, సామాజిక ఆసుపత్రి, రాజాం

ఆదిత్యాయ నమః

- వైభవంగా రథసప్తమి ఉత్సవాలు
- అరసవల్లికి పోటెత్తిన భక్తులు


ఆదిత్యుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. ప్రత్యక్ష దైవం.. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి ఉత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. క్షీరాభిషేకానికి... నిజరూప దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారిని కనులారా తిలకించి ... పులకించారు. సోమవారం రాత్రి నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో... శ్రీకాకుళం నగరంతో పాటు అరసవల్లి వీధులు కిక్కిరిశాయి. మరోవైపు రథసప్తమి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భక్తులు ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేశారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


పాయసం సిద్ధం చేస్తూ..


దయచేసి క్యూలో రండి: భక్తునికి దండం పెడుతున్న ఎస్పీ


ఉచిత ప్రసాదం కౌంటర్ దగ్గర రద్దీ..




పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తదితరులు


ఆదిత్యుని సన్నిధిలో శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష


సోమవారం అర్ధరాత్రి క్యూలో వేచి ఉన్న భక్తులు


ఆటోల్లో వెళ్తున్న భక్తులు


మొక్కలతో ఓంకారం


అలసిసొలసి...పోలీసులు ఇలా..


ఆలయం ఎదుట క్యూలో...


స్వామి దర్శనానికి దివ్యాంగులు


విశ్రాంతి తీసుకుంటూ..


ఉచిత దర్శన క్యూలైన్‌లో..


గజపతినగరం: సూర్యభగవానుడికి క్షీరాభిషేకం


మంగళవారం రాత్రి అరసవల్లి రోడ్డులో భక్తులు




రాజాం: సూర్య భగవానుడికి మహిళల పూజలు


భోగాపురం: పురవీధుల్లో ఊరేగింపు

భానుడికి కిరణాభిషేకం

పాలకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో సూర్యనారాయణ స్వామి మూలవిరాట్టుకు మంగళవారం సూర్యకిరణాలు తాకాయి. అనంతరం రథసప్తమి సందర్భంగా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు విబూది రవిస్వామి, వేమకోటి హరీష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి తిరువీధి మహోత్సవం నిర్వహించారు.


ఆదిత్యునికి సూర్యకిరణాలు తాకుతున్న దృశ్యం

ఘనంగా శ్యామలాంబ ఘటాల ఊరేగింపు

సాలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామ దేవత శ్యామలాంబ అమ్మవారి ఘటాలను మంగళవారం ఘనంగా ఊరేగించారు. జన్ని వీధిలో ఉన్న గద్దె దగ్గర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడి నుంచి కర్రివీధి, గాడి వీధి, చిన్నవీధి, అక్కే నవీధి, వేద సమాజం, చిన్న బజారు, చర్చి సెంటర్ మీదుగా సాలూరు యువరాజు విక్రమచంద్ర సన్యాసిరాజు ఇంటికి ఘటాలు చేరుకున్నాయి. అక్కడ సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. మళ్లీ కోట జంక్షన్ నుంచి పెదకోమటిపేట గద్దె దగ్గరకు చేరుకున్నాయి. అక్కడి నుంచి చిన్నబజారు వడ్డి వీధి నుంచి జన్ని వీధికి చేరుకున్నాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షులు అక్కేన అప్పారావు, పట్టణ టీడీపీ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, సిగడాపు బంగారయ్య పాల్గొన్నారు.


ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తోటపల్లికి ఉత్సవ శోభ

- వేంకటేశ్వర, కోదండ రామాలయాలకు కొత్త కళ
- నేటి నుంచి విగ్రహాల పునః ప్రతిష్ఠ

గరుగుబిల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చిన తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వర, శ్రీకోదండరామ స్వామి దేవస్థానాలు కల్యాణ మహోత్సవానికి ముస్తాబవుతున్నాయి. ఒకవైపు వేంకటేశ్వరుని కల్యాణం, మరోవైపు విగ్రహ పునః ప్రతిష్ఠ, కుంభాభిషేకం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 1972లో నిర్మించిన ఆలయాలు శిథి లావస్థకు చేరుకున్నాయి. దేవదాయ శాఖ చొరవ చూపకపోయినా ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్, దాతల సహకారంతో నిర్మాణానికి పూను కున్నారు. మొత్తం నిర్మాణాలకు రూ.7.50 కోట్ల తో ప్రతిపాదనలు రూపొందించారు. కోదండ రామాలయ నిర్మాణానికి అభివృద్ధి సేవా ట్రస్టు, ఖడ్గవలసకు చెందిన కిమిడి శ్రీరామ్మూర్తి, భాగ్య లక్ష్మి దంపతులు చొరవ చూపారు. సుమారు రూ. 20 లక్షలకు పైగా విరాళంగా ఇచ్చారు. వీరితో పాటు మరికొంతమంది దాతల సహకా రంతో ఈ ఆలయమూ పూర్వ వైభవం సంతరించుకుంది.

నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు..

ఉభయ దేవస్థానాల పరిధిలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 5న వేంకటేశ్వర విగ్రహ పునః ప్రతిష్ఠ, 6న ప్రత్యేక పూజలు, 7న కుంభాభిషేకం, 8న కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఉప ఆలయాలు..

దేవస్థానం ప్రాంగణంలో వినాయకుడు, అభయాంజనేయుడు, సరస్వతీ దేవి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. గాలి గోపురం, ప్రాకార మండపం, భోజన శాలను నిర్మించారు.


నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం

అధికారులు స్పందించాలి..

తోటపల్లి దేవస్థానాల అభివృద్ధికి గతంలో రూ.కోటికి పైగా మంజూరైనా నేటికీ విడుదల కాలేదు. దాతలు, ఆలయ అభివృద్ధి సేవా ట్రస్టు ప్రతినిధుల సహకారంతోనే పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. విశ్రాంత ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం కల్యాణ మండపానికి చొరవ చూపుతున్నారు. దీని నిర్మాణానికి 1.10 ఎకరాల స్థలం అవసరం. దేవస్థానం ప్రాంగణంలో ఆక్రమణలు తొలగిస్తే స్థల సమస్య తీరనుంది. జిల్లా యంత్రాంగం స్పందించాల్సి ఉంది.

-డాక్టర్ డి.పారినాయుడు, ప్రధాన కార్యదర్శి, తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

తోటపల్లి దేవస్థానం అభివృద్ధికి అవసరమైన నిధుల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ సహకారంతో అభివృద్ధి జరుగుతుంది. ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారిస్తున్నాం.

-వీవీ సూర్యనారాయణ, ఆలయ ఈవో

నాడు కళకళ.. నేడు వెలవెల



నాడు బస్టాండ్ ప్రాంతం

- దుర్గంధభరితంగా పాత బస్టాండ్
- పెరిగిపోతున్న ఆక్రమణలు
- ఖాళీ అయిన మున్సిపల్ షాపులు



నేడు ఇలా..

రాజాం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులతో కళకళలాడే ప్రాంతం.. లక్షలాది రూపాయల వ్యాపార లావాదేవీలు జరిగే ప్రదేశం.. మున్సిపాలిటీకి వేలాది రూపాయలు ఆదాయాన్ని సమకూర్చే వ్యాపార కూడలి.. చిన్నపాటి నిర్ణయంతో కళావిహీనంగా మారింది. నేడు దుర్గంధంతో అడుగుపెట్టలేని దుస్థితి నెలకొంది. షాపులన్నీ ఖాళీ అయ్యాయి. మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడింది. వందకు పైగా కుటుంబాల జీవితాలలో చీకట్లు నింపింది. అదే రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్.

రాజాం మేజర్ పంచాయతీ కాలం నుంచి బస్టాండ్ నిర్వహించే ప్రాంతం కాలక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని వచ్చింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజాం మున్సిపాలిటీ ఆర్టీసీకి కేటాయించిన రెండెకరాల స్థలంలో గతేడాది ఫిబ్రవరిలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రైవేటు వాహనాలు, వ్యాపారుల తాకిడిని నియంత్రించే చర్యల్లో భాగంగా ఆర్టీసీ తన పరిధిలో అడ్డంగా గోడను నిర్మించారు. ఫలితంగా పాత బస్టాండ్ ప్రాంతంలో రద్దీ తగ్గింది. దీంతో మున్సిపల్ పరిధిలో ఉన్న రెండు షాపింగ్ కాంప్లెక్స్‌ల పరిధిలో ఉన్న షాపులకు వ్యాపారం తగ్గుముఖం పట్టింది. వ్యాపారాలు లేకపోవడంతో షాపులను ఖాళీ చేశారు. దశాబ్దాలుగా బస్టాండ్‌నే నమ్ముకుని కుటుంబాలను నెట్టుకొస్తున్న చిరు వ్యాపారులు బతుకుతెరువు కోల్పోయారు. ఏడాదికి సుమారు రూ.10 లక్షల వరకూ మున్సిపల్ ఆదాయానికి గండి పడింది.

పాత బస్టాండ్ ప్రాంతం దుర్గంధపూరితంగా తయారైంది. ఇక్కడే పెద్దసంఖ్యలో కూరగాయలు, ఆకుకూరల వ్యాపారులు నిత్యం ఉదయాన్నే తిష్ట వేస్తున్నారు. వ్యర్థాలన్నీ పడవేస్తున్నారు ఇదే ప్రాంతంలో ఆటోలు, మినీ వేన్లు, ఇతరత్రా వాహనాలను నిలిపివేస్తున్నారు. ఇదే అదనుగా కొంతమంది ఆక్రమణలకు తెరలేపారు. బడ్డీలు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంగణంలో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన రైతుబజార్ వెలవెలబోతోంది. లోపలికి వెళ్లేందుకు కూడా వీల్లేని విధంగా దుర్గంధభరితంగా మారడంతో కొనుగోలుదారులు రైతుబజార్ వైపు కన్నెత్తి చూడటంలేదు. దీంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



జామిలో పరిశీలిస్తున్న ఆర్డీవో కీర్తి

జామి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జామిలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆర్డీవో కీర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణలతకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీ మూర్తి, ఎస్‌ఐ వీర జనార్దన్ తదితరులున్నారు.

●వేపాడ: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వేపాడ జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో కీర్తి మంగళవారం పరిశీలించారు. ఆమెతో పాటు తహసీల్దారు జె.రాములమ్మ, డిప్యూటీ తహసీల్దారు సన్యాసినాయుడు ఉన్నారు.

●లక్కవరపుకోట: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఆర్డీవో కీర్తి ఎల్.కోట మండలం కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమెతో పాటు తహసీల్దారు ప్రసాదరావు ఉన్నారు.

●గంట్యాడ: గంట్యాడలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని విజయనగరం ఆర్డీవో కీర్తి మంగళవారం పరిశీలించారు. ఆమెతోపాటు తహసీల్దార్ నీలకంఠరేశ్వరెడ్డి ఉన్నారు.

అలమండ పీహెచ్‌సీలో తనిఖీ

జామి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ పీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌వో జీవన్‌రాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రోగులకు సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావ్య ఉన్నారు.

అవయవదానానికి తహసీల్దారు దంపతుల అంగీకారం

చీపురుపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పట్టణ తహసీల్దారుగా పనిచేస్తున్న నీల కూర్మారావు ఆయన సతీమణి, కలెక్టరేట్‌లో ఉప తహసీల్దారుగా పనిచేస్తున్న ఎం. ఉమ అవయవ దానానికి అంగీకరించారు. చీపురుపల్లి పట్టణానికి చెందిన మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులుకు మంగళవారం తమ అంగీకార పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు ముడిదాపు రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు ముహూర్తపు రాట

రాజాం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజాంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరను మార్చి 9 నుంచి 11 నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం ముహూర్తం రాట వేయనున్నట్లు దేవస్థానం ఈవో బి.వి.మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామపెద్దలు, భక్తులు హాజరు కావాలని కోరారు.

నీలిమాంబ ఉత్సవాలు

రాజాం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాణావీధిలో నీలిమాంబదేవి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామున 4 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు.

కొల్లకు పితృ వియోగం

రాజాం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు కొల్ల అప్పలనాయుడు తండ్రి కొల్ల సూర్యనారాయణ (94) మంగళవారం మృతి చెందారు. ఆయన మృతిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు కోండ్రు మురళీ, కిమిడి కళావెంకట్రావు తదితరులు సంతాపం తెలిపారు.

రెండోరోజూ ఆక్రమణల తొలగింపు

రాజాం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజాంలో రెండోరోజూ మంగళవారం కూడా ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగింది. రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సారథ్యంలో ఎస్‌ఐ రవికిరణ్, సిబ్బంది మున్సిపల్ యంత్రాంగం సహకారంతో శ్రీనివాసారోడ్‌లో ఆక్రమణలు, అంబేడ్కర్ జంక్షన్ నుంచి బజార్‌రోడ్ జంక్షన్ వరకూ నరకంగా ఉండే రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఏళ్లుగా ఈ ప్రాంతంలోనే కూరగాయల వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్న చిరువ్యాపారులకు పాత బస్టాండ్ ప్రాంతంలో వ్యాపారాలు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. నాలుగుచక్రాల బళ్లను శ్రీనివాసారోడ్‌లో నిలిపితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ ప్రాంతంపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ఎవ్వరైనా ఆక్రమణలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. వ్యాపారులు మిగిలి పోయిన, కుళ్లిపోయిన కూరగాయలను, ఇతరత్రా వ్యర్థాలను కళాశాల ప్రాంగణంలో వేయడం తగదన్నారు.

ప్రకృతి సాగును విస్తరించండి

●కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి సాగుకు విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖరీఫ్ 2025లో ప్రకృతి సాగు ప్రణాళికపై కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి సాగు పద్ధతులను సామాన్య రైతులకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 27 మండలాల్లో 54 యూనిట్లు ఉన్నాయని, 220 పంచాయతీల్లో ప్రకృతి సాగు జరుగుతోందన్నారు. మహిళా సంఘాల్లో 1,12,151 మంది సభ్యులు ఉన్నప్పటికీ కేవలం 59,279 మంది మాత్రమే సుమారు 80 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు పద్ధతులు అనుసరిస్తున్నారన్నారు. మిగిలిన వారిని చైతన్యపరచాలని సూచించారు. ప్రస్తుతం 28 శాతంగా ఉన్న వీరి సంఖ్య 40 శాతానికి చేర్చాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ రామారావు, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, మైక్రో ఇరిగేషన్ పీడీ లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచండి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి లీడ్ ఇండియా ఫౌండేషన్ ద్వారా కృషి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం లీడ్ ఇండియా సంస్థ బృందం జిల్లా కలెక్టర్‌ను కలిశారు. పిల్లల్లో లీడర్ షిప్ లక్షణాలు, విలువలు, నైపుణ్యం, ఆలోచన శక్తిని పెంచడం తదితర అంశాలపై అవగాహన కలిగించడానికి లీడ్ ఇండియా ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని డీఈవో మాణిక్యం నాయుడుకు సూచించారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా ప్రతినిధులు ఉమ, బాలాజీ తదితరులున్నారు.

వీఎంఆర్‌డీఏతో నగరంలో అభివృద్ధి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు రహదారులు, పార్కులు అభివృద్ధిని విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ద్వారా చేపట్టడానికి ప్రతిపాదనలు చేసినట్టు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం ఆయన చాంబర్‌లో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జేసీ సేతు మాధవన్‌తో చర్చించారు. స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ నుంచి ధర్మపురి, ఐనాడ వరకూ జేఎన్‌టీయూ, మెడికల్ కాలేజీ రోడ్డును అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించినట్టు తెలిపారు. అలాగే రింగ్ రోడ్డు వద్ద పీఎస్‌ఆర్ పార్కు, అయ్యన్నపేట వద్ద పార్కులు అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్టు వివరించారు. ఆనందగజపతి ఆడిటోరియం ఆధునికీకరణ, ఆడిటోరియం వద్ద డిజిటల్ లైబ్రరీ, స్టడీ సెంటర్, కమర్షియల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశామని తెలిపారు.

స్థల పరిశీలన చేసిన వీఎంఆర్‌డీఏ

భోగాపురం: మండలంలోని రావాడ రెవెన్యూ సర్వేనెంబరు 64-1లో వీఎంఆర్‌డీఏ అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. మండలంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతుండడంతో అభివృద్ధిలో భాగంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అనువైన స్థలాలను గుర్తిస్తోంది. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ వి.ఎస్.విశ్వనాథన్, వీఎంఆర్‌డీఏ తహసీల్దార్ వేణుగోపాల్, డీఐ వోఎస్ భగవాన్, భోగాపురం తహసీల్దార్ సురేష్, సర్వేయర్ మధుకేశవరావు, ఆర్‌ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

తూనికల్లో అవకతవకలు

●ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంపై గుళ్లు పెట్టి దగా



ఎలక్ట్రానిక్ యంత్రంపై అదనంగా గుండు పెట్టి తూనిక చేస్తున్న దృశ్యం

భోగాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చౌకధరల దుకాణాలు, ఎండీయూ ఆపరేటర్ల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్న బియ్యం తూనికలో అవకతవకలు జరుగుతున్నాయి. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి రేషన్ సరఫరా చేయాల్సి ఉండగా కొంత మంది ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు కుమ్మక్కై రేషన్ దుకాణాల వద్దే సరుకులు అందజేస్తున్నారు. అదే అదునుగా వారు అక్రమాలకు తెర తీస్తున్నారు. మండలంలోని ముక్కాంలో రేషన్‌ను ఎండీయూ వాహనం ద్వారా సరఫరా చేయకుండా తుఫాన్ భవనంలో నిర్వహిస్తున్న చౌకధరల దుకాణం వద్దే ఆపరేటర్ రాము బియ్యం పంపిణీ చేస్తున్నాడు. అయితే బియ్యం తూనికకు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాన్నే ఉపయోగించాల్సి ఉండగా.. దానిపై అదనంగా మరో తూకపు గుండును పెట్టి కాటా వేసి బియ్యం అందజేస్తున్నాడు. కొంత బరువు అదనంగా ఉంచి తూనిక వేస్తున్నాడు. ఇదంతా బహిరంగంగానే జరుగుతోంది. అయితే ఇదే చౌకధరల దుకాణానికి చెందిన డీలర్ అవకతవకలకు పాల్పడటంతో గతంలో 6ఏ కేసు నమోదు చేశారు. దీనిపై ఎండీయూ ఆపరేటర్ రాము మాట్లాడుతూ వాహనం రిపేరు కారణంగా అధికారుల సూచనల మేరకు రేషన్ డిపో వద్ద బియ్యం అందజేస్తున్నామన్నారు. తూనికలో ఎటువంటి తేడా చేయడంలేదన్నారు. దీనిపై ఇన్‌చార్జి సీఎస్ డీటీ శంకర్ వివరణ కోరగా తూనిక యంత్రంపై అదనంగా గుండు పెట్టి తూనిక వేయడం చేయకూడదన్నారు. మళ్లీ అలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని డీటీ చెప్పారు.

ఉపాధి పనులు పరిశీలించిన పీడీ



పనులు పరిశీలిస్తున్న పీడీ శారదాదేవి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గరాజుపేట, ఎ.టి.అగ్రహారం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం పీడీ ఎస్.శారదాదేవి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో నిర్మించిన మినీ గోకులాలు, ఫారం పాండ్‌లను చూశారు. జూన్ నాటికి ప్రతి పంచాయతీలో 25 ఫారం పాండ్‌లు, ఓ ఫిష్ పాండ్, 20 ఎకరాలకు సరిహద్దు ట్రెంచ్ కటింగ్‌లు, 2 గోకులాలను పూర్తిచేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఏపీవో అరుణకుమారి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కార్తీక్ తదితరులున్నారు

శ్రమ దోపిడీ చేస్తున్నారు

● గోదాముల ఎదుట కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు

చీపురుపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస సమీపంలో ఉన్న ఫుడ్ పార్క్‌లో శ్రమ దోపిడీ జరుగుతోందని, ఇక్కడి ఎఫ్‌సీఐ గోదాముల్లో ప్రభుత్వ నిర్దేశించిన ధరలు వర్తించడం లేదని కార్మికులు ఆరోపించారు. మంగళవారం వారు గోదాముల వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల ప్రతినిధి పాపారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం బియ్యం అన్ లోడింగ్‌కు తమకు లారీ లోడుకు రూ.9500 చెల్లించాల్సి ఉందని, జిల్లాలోని ఇతర గోదాముల వద్ద రూ.6500 చెల్లిస్తున్నారన్నారు.అయితే, స్థానిక ఫుడ్ పార్క్ యాజమాన్యం మాత్రం తమకు కేవలం రూ.5 వేలు మాత్రమే ఇస్తు న్నారన్నారు. అదే విధంగా బియ్యాన్ని లోడింగ్ చేయడానికి బస్తాకు రూ.18 రూపాయలు మాత్రమే ఇస్తున్నారన్నారు. దీంతో బాటు బియ్యాన్ని ఒక గోదాము నుంచి వేరొక గోదాముకు మార్చడానికి కూడా అతి తక్కువ కూలీ రేట్లు చెల్లిస్తూ, కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిరసన ప్రదర్శనలో దాదాపు వంద మంది కార్మికులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కార్మికుల ఆరోపణపై ఫుడ్ పార్క్ ప్రతినిధి రాము మాట్లాడుతూ ఎఫ్‌సీఐ గోదాముల్లో బియ్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులు కాంట్రాక్టరు కు అప్పగించామన్నారు. ఈ వ్యవహారంలో ఫుడ్‌పార్క్ యాజమాన్యానికి ఎటువంటి సంబంధం లేదన్నారు.

నాలుగు దాటాక వైద్యులు ఉండరంట!

● గర్భిణిని చేర్చుకోని గజపతినగరం ఆసుపత్రి సిబ్బంది

● 108లో ప్రసవం.. ఘోషా ఆస్పత్రిలో చికిత్స



తల్లీబిడ్డను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మెంటాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణిని ఆస్పత్రిలో చేర్చుకోని ఘటన గజపతినగరం ఆస్పత్రిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గత్యంతరంలేక విజయనగరం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో ఆమె 108 వాహనంలోనే పండంటి బిడ్డను ప్రసవించింది. ప్రస్తుతం ఘోషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల వివరాల మేరకు.. కూనేరు పంచాయతీ మిర్తివలస గ్రామానికి చెందిన పాడి గౌరమ్మకు మంగళవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు కొంత దూరం ఆమెను డోలీలో తరలించారు. అక్కడ నుంచి 108 వాహనం ద్వారా గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి సాయంత్రం 5 గంటల సమయంలో తీసుకువెళ్లారు. అయితే ఆమెను చేర్చుకునేందుకు ఆసుపత్రి సిబ్బంది నిరాకరించారు. నాలుగు గంటల దాటాక వైద్యులు ఆస్పత్రిలో అందుబాటులో ఉండరని మీకు తెలియదా? ఎందుకు ఇప్పుడు తీసుకొచ్చారని 108 వాహనం సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. గర్భిణికి ఇది రెండో కాన్పు అని, మొదటి కాన్పుకు సిజేరియన్ చేశారని, గర్భిణి పరిస్థితి విషమంగా ఉందని చెప్పినా ఆసుపత్రి సిబ్బంది చేర్చుకోమని తెగేసి చెప్పారు. దాంతో 108 సిబ్బంది ఆమెను విజయనగరం ఘోషా ఆసుపత్రికి తరలిస్తుండగా విజయనగరం సమీపంలోని ఆర్కేటౌన్ షిప్ వద్ద గౌరమ్మ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను 108 వాహనం సిబ్బంది ఘోషా ఆస్పత్రిలో చేర్చారు. తల్లీబిడ్డను కాపాడిన 108 సిబ్బంది గౌరినాయుడు, శివను పలువురు అభినందించారు.

● ఈ ఘటనపై విచారణ జరిపించాలని సీపీఎం నాయకుడు రాకోటి రాములు డిమాండ్ చేశారు. నాటు వైద్యం నుంచి ఇప్పుడిప్పుడే మెరుగైన వైద్యం వైపు గిరిజనులు మొగ్గు చూపుతున్నారన్నారు. అటువంటి గిరిజన గర్భిణిని 24 గంటలు సేవలు అందజేసే ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రసవ వేదన భరించలేక ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఘనంగా రథసప్తమి పూజలు



గరివిడిలో సూర్యనారాయణస్వామి



శృంగవరపుకోట: సూర్యనారాయణ దేవస్థానంలో..

●గరివిడి ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా గరివిడిలో వెలిసిన శ్రీసూర్య నారాయణస్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూలవిరాట్టుకు నవకలశ స్నపనం, క్షీరాభిషేకం చేశారు. వేమకోటి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి

●శృంగవరపుకోట: శృంగవరపుకోటలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుణ్యగిరి రోడ్డులోని సూర్యనారాయణ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ●మెరకముడిదాం: మండలంలోని సోమలింగపురంలోని సూర్యదేవుడి ఆలయంలో రథసప్తమి పర్వదినాన ప్రత్యేకపూజలు ఘనంగా నిర్వహించారు.

క్రైం న్యూస్

చెరుకు ట్రాక్టర్ బోల్తా

వంగర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మగ్గూరులో మంగళవారం చెరుకు టాక్టర్ బోల్తాపడింది. ఆ సమయంలో ఎవరైే లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఓని చెరుకు కాటా నుంచి రేగిడి మండలం సంకిలి చక్కెర కర్మాగారానికి చెరుకు లోడుతో బయలుదేరిన ట్రాక్టర్ మెట్ట మగ్గూరు మలుపులో చెరుకు లోడుతో ప్రధాన రహదారిపై బోల్తా పడింది. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్‌ఐ షేక్ శంకర్ ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను దారి మళ్లించి పరిస్థితిని చక్కదిద్దారు.

రోటరీ స్వర్గధామంలో విగ్రహాల ధ్వంసం

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కొత్తపేట, రోటరీ స్వర్గధామానికి వెళ్లే రహదారిలో చండ, ప్రచండ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. 2007లో రోటరీక్లబ్ అధునాతన సౌకర్యాలతో స్వర్గధామాన్ని నిర్మించింది. నిర్మాణంలో భాగంగా దశ దిక్పాలకులుగా పలు విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాల్లో రెండింటిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై రోటరీక్లబ్ ప్రతినిధి చలం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

బాలిక అదృశ్యం

భోగాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలం తూడెం గ్రామానికి చెందిన బాలిక వనుం రమ్య అదృశ్యమైనట్లు తండ్రి వనుం అప్పారావు మంగళవారం ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు. రమ్య మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిందని, విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరానికి చెందిన ఓ వ్యక్తి తీసుకెళ్లినట్టు అనుమానంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కోలుకుంటున్న వసతిగృహం విద్యార్థినులు

●ముగ్గురు డిశ్చార్జ్ ●మరో ముగ్గురికి కొనసాగుతున్న చికిత్స



ఐసీయూలో చికిత్స పొందుతున్న జశ్విని

విజయనగరం రింగురోడ్డు/ కలెక్టరేట్ ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్‌తో సోమవారం రాత్రి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగరంలోని సుంకరవీధిలో గల సాంఘిక సంక్షేమ వసతిగృహం విద్యార్థినిలు కోలుకుంటున్నారు. సోమవారం మధ్యాహ్న భోజనంగా బిరియానీ తినడంతో విద్యార్థినిల్లో కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు కన్పించాయి. దాంతో ముగ్గురు విద్యార్థులకు ఆస్పత్రిలో వార్డెన్ చేర్పించారు. మరో ఇద్దరిని మంగళవారం ఉదయం జిల్లా కేంద్రాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. వీరిద్దరికీ స్వల్ప లక్షణాలు కన్పించడంతో మందులు ఇచ్చి పంపించేశారు. ప్రస్తుతం టి.జశ్విని, ఎ.అలైఖ్య, బి.దీపిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జశ్వినిని ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా వుంది. అదే విధంగా మిగతా ఇద్దరు విద్యార్థినీల ఆరోగ్య పరిస్థితి బాగుందని ఆస్పత్రి సూపరిడెంట్‌ంట్ డాక్టర్ అప్పలనాయుడు తెలిపారు. ఈ ఘటనపై సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బోని రామానందం ఆస్పత్రిలో మాట్లాడుతూ ఆరుగురు విద్యార్థులకు గానూ ముగ్గురిని ఇప్పటికే డిశ్చార్జ్ చేశారన్నారు. మిగతా ముగ్గురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

విజయనగరం దాసన్నపేట: నగరంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహం-3లో అస్వస్థతకు గురైన విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్.వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వసతి గృహంలోని ఆహారం కలుషితం కావడంతో 20 మంది విద్యార్థులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారన్నారు. ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సాంఘిక సంక్షేమశాఖ స్పందించకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించకుంటే డీడీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

జాతర నిర్వహణపై గందరగోళం

జామి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు జామి ఎల్లారమ్మ జాతరకు సంబంధించి మంగళవారం జామిలో వేద పండితులు ముహూర్తం నిర్ణయించారు. మార్చి 6, 7, 8 తేదీల్లో జాతరను నిర్వహించేందుకు ఖాయం చేశారు. అయితే జాతర నిర్వహణపై గందరగోళం నెలకొంది. ఈ పండుగను ఎన్నికల కోడ్ నేపథ్యంలో దేవాదాయశాఖ నిర్వహిస్తుందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు. దాంతో ఈవో వాదనను ఉప సర్పంచ్ అల్లు పద్మ, వైసీపీ నాయకులు వ్యతిరేకించారు. ఈ ఆలయానికి పాలకమండలి ఉందని, వారి గడువు ముగియలేదన్నారు. జాతరను పాలక మండలి నిర్వహిస్తుందని బదులిచ్చారు. దాంతో ఈవో.. పాలక మండళ్లను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని అనడంతో చిన్నపాటి వివాదం రాజుకుంది. జామి ఎంపీటీసీ సభ్యుడు అల్లు సత్యాజీ మాట్లాడుతూ పాలకమండలి రద్దుపై ఎటువంటి ఉత్తర్వులు రాలేదని, ఆ ఉత్తర్వులు ఉంటే చూపాలని కోరారు. లేకుంటే జాతరను పాలక మండలి నిర్వహిస్తుందని తేల్చి చెప్పారు. ఈ విషయం గ్రామంలో పెద్ద చర్చకు తెరలేసింది.

పింఛన్లు ఇవ్వలేదన్న ఫిర్యాదుపై విచారణ

రాజాం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజియ్యపేట, పెనుబాక గ్రామాల్లో ఇంటి దగ్గర పింఛన్లు అందజేయలేదని కొందరు ఐవీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేయడంతో ఎంపీడీవో శ్రీనివాసరావు మంగళవారం విచారణ చేపట్టారు. ఆయా గ్రామాలకు వెళ్లి పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి దగ్గరే సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారని గుర్తించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సచివాలయ సిబ్బందిని ఆట పట్టించడానికి తప్పుడు కాల్ చేశారని ఎంపీఈడీ చెప్పారు. అనంతరం రాజియ్యపేట సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బొమ్మినాయుడువలసలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు.

జాకేరులో తీర్థ మహోత్సవం ప్రారంభం

వేపాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాకేరులో గ్రామదేవతలు చిన్నాలమ్మ, పైడమ్మ పేరంటాళ్ల తీర్థమహోత్సవం తొలిరోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు, కోలాట ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనాయుడు ఉన్నారు.

ఆసనాలతో ఆరోగ్యం



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

డెంకాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని వశిష్ట విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు సూర్య నమస్కారాలు చేశారు. ఈ సందర్భంగా రథసప్తమి విశిష్టతలను పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్.రమేష్‌బాబు విద్యార్థులకు వివరించారు. ప్రాతః కాలంలో చేసే పనులు, వాటివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలియజెప్పారు.

జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలి

గంట్యాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని నాబార్డు డీడీఎం నాగార్జున అన్నారు. మంగళవారం నాబార్డు సహకారంతో సబల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాల రైతులతో సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో రైతు సంఘం సీఈవో రామారావు, సర్పంచ్ రమేష్ ఉన్నారు.

గ్రీన్ స్కూల్ అవార్డు ప్రదానం

రేగిడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రీన్‌స్కూల్‌గా రేగిడి హైస్కూల్‌కు మంగళవారం ఢిల్లీలోని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ సునీత నరైన్ అవార్డు ప్రదానం చేశారు. స్కూల్ సైన్స్ టీచర్ బూరవిల్లి ఉమామహేశ్వరి అవార్డును అందుకున్నారు.

150 గజాల వరకు ఉచితం

(ఐదో పేజీ తరువాయి)

ఎగువనున్న కుటుంబాలకు మరో రకంగాను ప్రభుత్వం క్రమబద్ధీకరణ ఫీజులను నిర్ణయించింది. బీపీఎల్ కుటుంబాలైతే 50శాతం చెల్లింపులకు అనుమతించారు. ఏపీఎల్ కుటుంబాలకు సాధారణ రిజిస్ట్రేషన్ ఫీజంతా చెల్లించాలి. క్రమబద్ధీకరణకు లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా భూపరిపాలన శాఖ కమిషనర్‌కు దరఖాస్తులు పంపించాలి. వారి నుంచి రశీదులు పొందాలి. తహసీల్దార్‌ల పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆక్రమణలు జరిగిన ప్రాంతాలను పరిశీలిస్తారు. ఆపై అర్హత ఉన్న లబ్ధిదారుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. అభ్యంతరాలను స్వీకరిస్తారు. తుది జాబితాను తహసీల్దార్‌లు సబ్ కలెక్టర్, ఆర్డీవోకు పంపించాలి. సబ్‌డివిజనల్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అర్హుల జాబితాపైనా అభ్యంతరాలుంటే జాయింట్ కలెక్టర్ నెల రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటారు. అర్హుల జాబితా ఖరారైన తరువాత ఆ వివరాలను తహసీల్దార్‌లు, సబ్ రిజిస్ట్రార్ల వద్దకు చేరతాయి.

● గ్రామాల్లో నెలకు గరిష్ఠంగా రూ.10వేలు, పట్టణాల్లో నెలకు రూ.14 వేలు ఆదాయం, నెలకు 300లోపు విద్యుత్ చార్జీల చెల్లింపు, మెట్ట, మాగాణి కలిపి 10 ఎకరాలకు మించి ఉండని పొలం, ఆర్‌సీసీ రూఫ్, ఆస్ బెస్టాస్ రూఫ్‌ను ఇటుక గోడలతో నిర్మించిన ఇళ్ల లబ్ధిదారులు అర్హులు. క్రమబద్ధీకరణకు రిజిస్టర్ డాక్యుమెంట్, ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్ బిల్లు, వాటర్ బిల్లులను దరఖాస్తు చేసే సమయంలో పరిగణనలోకి తీసుకుంటారు.

ప్లీజ్.. ప్రాణం నిలపండి

(ఐదో పేజీ తరువాయి)

భావించారు. 30 నిమిషాల తరువాత అక్కడికి చేరుకున్న రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ అతను బతికే ఉన్నట్లు గుర్తించి రాజాం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. మృతి చెందాడని భావించిన ఆ వ్యక్తి బతికాడు.. సీఐ అశోక్‌కుమార్ స్పందించకపోతే ఆ వ్యక్తి ప్రాణాలు గాల్లో కలిసిపోయేవేమో..

ఎక్కువ మందిని కాపాడితే లక్ష..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం అందక సకాలంలో ఆసుపత్రికి తరలించక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. క్షతగాత్రుల్ని గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంటలోపు) ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిచే అవకాశాలెక్కువని వైద్యులు చెబుతున్నారు. ఇలా చేసిన వారు పోలీస్ కేసుల భయం లేకుండా గుడ్ సమరిటన్ చట్టం అండగా నిలుస్తుంది. ఎక్కువ మందిని కాపాడితే రూ.లక్ష అదనపు ప్రోత్సాహకం అందిస్తారు.

ప్రోత్సాహకం పొందాలంటే..

ప్రాణాపాయంలో ఉన్నవారికి ఆసుపత్రికి తరలించి సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే... పోలీసులు అధికారికంగా లేఖ ఇస్తారు. ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలతో పాటు పోలీస్‌శాఖ, ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి తహసీల్దార్‌కు దరఖాస్తు చేయాలి. రవాణా, రెవెన్యూ, పోలీస్, జాతీయ రహదారుల సంస్థ, ఆర్అండ్‌బీ అధికారులతో కూడిన కమిటి గుర్తించి నగదు ప్రోత్సాహకానికి ఎంపిక చేస్తుంది.

ఎట్టకేలకు మట్టిని పూడ్చారు



బొబ్బిలి పెట్రోల్ బంకు జంక్షన్ వద్ద గోతులు పూడ్చుతున్న దృశ్యం

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పలు ప్రదేశాలలో ఎట్టకేలకు మరమ్మతుల కోసం తవ్విన గోతులను మున్సిపల్ సిబ్బంది మంగళవారం పూడ్చారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం 'తవ్వేశారు.. వదిలేశారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పైపులైన్ మరమ్మతుల కోసం మట్టిని తవ్వి విడిచిపెట్టిన ప్రదేశాలలో యుద్ధప్రాతిపదికన జేసీబీతో మట్టిని పూడ్చారు. వాహనచోదకులకు ఆటంకం కలగకుండా చేశారు. ఇకపై వెంట వెంటనే గోతులు పూడ్చేస్తామని ఏఈ గుప్త తెలిపారు. ఇందుకు వాహన చోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 150 మంది బాడీ బిల్డర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముగడ అనిల్, పొట్టేలు రవి, సమితి యువత పాల్గొన్నారు.

నిరుద్యోగులకు భృతి చెల్లించాలి

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు భృతి చెల్లించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ డిమాండ్ చేశారు. బొబ్బిలి గంటి ప్రసాదం భవనంలో మంగళవారం నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గెలిస్తే ఖాళీగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఏదీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు బి.వాసు, కోట అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

● సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామానందం

లక్కవరపుకోట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామానందం తెలిపారు. మంగళవారం ఆయన ఎల్.కోట, విజయనగరం, వియ్యంపేటలోని వసతి గృహాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. 23 వసతి గృహాలు మరమ్మతులకు రూ.4.67కోట్లు విడుదల అయ్యాయని ఆయన తెలిపారు. 2,200 మంది ఎస్సీ విద్యార్థులకు అన్ని రకాల కాస్మోటిక్స్, టవల్స్, దుప్పట్లు వచ్చాయన్నారు. జగజ్జీవన్‌జ్యోతి పథకం ద్వారా 54,361 మందికి రూ.8.53 కోట్ల నిధులు విడుదలయ్యాయని ఆయన వివరించారు. 48,383 మందికి వారి ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేశారని తెలిపారు.

స్వల్పకాలిక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కౌసల్య యోజన పథకంలో భాగంగా స్కిల్ హబ్ ఇనిషియేటివ్ కార్యక్రమం ద్వారా సీతంపేట ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణా కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫోర్‌వీలర్ మెకానిక్(కనీస విద్యార్హత పదో తరగతి), సూయింగ్ మిషన్ ఆపరేటర్(టైలరింగ్) కోర్సుల లో చేరేందుకు ఈనెల 15లోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు విద్యార్హత ధ్రువ పత్రాలు దరఖాస్తుతో జత చేసి సీతంపేట ఐటీఐకి అందజేయాలన్నారు.

ఇక్కడ బిల్లులు లేవు.. అక్కడ పనులే లేవు

'పల్లె పండుగ' నిధుల చెల్లింపులో జాప్యం

● డీలా పడుతున్న కాంట్రాక్టర్లు

రామభద్రపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువల పనులు చేపట్టింది. అయితే కొన్ని చోట్ల పనులు పూర్తి చేసి, నెలలు గడుస్తున్నా గుత్తేదారులకు బిల్లులు అందలేదు. నవంబరు నెలలో తలపెట్టిన ఈ పనులకు మొదట్లో వెంటవెంటనే బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత జరిగిన పనులకు నిధుల చెల్లింపులో జాప్యం జరగడంతో కాంట్రాక్టర్లు డీలా పడుతున్నారు. మండలంలో మొదటి విడతగా 22 పంచాయతీల్లో 80 పనులు మంజూరు చేశారు. వీటిలో రెండు పనులు ప్రారంభించలేదు. 65 పనులను పూర్తిచేశారు. వీటిలో 45 పనులకు గాను ఇప్పటికీ సుమారు రూ.కోటి 30లక్షల బిల్లులు చెల్లించలేదు. సుమారు 8 వారాలైనా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెండు మూడు రోజుల్లో చెల్లిస్తాం

పల్లె పండుగ పనులకు సంబంధించి ఎంబుక్‌లు, రికార్డింగ్ పూర్తిచేశాం. నిధుల కొరత కారణంగా కొంత ఆలస్యమైంది. రెండు మూడు రోజుల్లో బిల్లులు చెల్లిస్తాం.

- రమేష్, పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఏఈ



నర్సాపురంలో నిర్మాణం పూర్తయిన సిమెంట్ రోడ్డు

మా గ్రామానికి 'పల్లె పండుగ' ఏదీ?

● రహదారి సౌకర్యం లేని చినపసుపాం

పూసపాటిరేగ, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి 'పల్లె పండుగ' ఏదీ అంటూ పసుపాం పంచాయతీ చినపసుపాం గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. చినుకు పడితే ఆ గ్రామానికి వెళ్లడం పెద్ద సాహసమే. ప్రస్తుతం గతుకులతో ఉన్న మట్టి రోడ్డే వీరికి దిక్కు. సుమారు 25 గృహాలు ఉన్న ఈ గ్రామంలో కొన్ని కుటుంబాలు వలస వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికైనా స్థానిక నాయకులు, అధికారులు తమ గ్రామానికి శాశ్వత రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రహదారి నిర్మించరూ..

మా గ్రామానికి చాలా ఏళ్ల నుంచి సరైన రహదారి లేదు. కొందరు వేరే గ్రామాలకు తరలి వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. చీకటైనా.. చినుకు పడినా గ్రామానికి రావటం చాలా కష్టం. మా గ్రామానికి రహదారి నిర్మించండి

- వాళ్లె రమణ, చినపసుపాం గ్రామస్థుడు



చినపసుపాం గ్రామానికి వెళ్లే రహదారి ఇదే..

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రాసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు, పీవో వీవీబీ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ మాధవీలత పాల్గొన్నారు. ● పార్వతీపురంటౌన్/బెలగాం: ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మన్యం జిల్లా పీఎంపీల ఆధ్వర్యంలో మంగళవారం పార్వతీపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీఎంపీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సింహాచలం, గోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు వి.శంకరరావు, కోశాధికారి బి.తులసీదాస్, సహాయ కార్యదర్శి బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● వీరఘట్టం: వీరఘట్టం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి పాలవలస ఉమామహేశ్వరి, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు. ● బొబ్బిలి/రూరల్: బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు, గైనకాలజిస్ట్ రోజారాణి మాట్లాడుతూ కేన్సర్ నివారణ టీకాలు 9 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు వేస్తామని తెలిపారు.



విజయనగరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి



పార్వతీపురంటౌన్/బెలగాం: పీఎంపీ సంఘ ఆధ్వర్యంలో..



వీరఘట్టం: అవగాహన కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది



బొబ్బిలి/రూరల్: అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శశిభూషణరావు

న్యూస్ బాక్స్

వేతనదారుల సంఖ్య పెంచాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో వేతనదారులు అధికంగా పాల్గొనేలా క్షేత్ర సహాయకులు దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఏపీవో ఎం.గౌరీనాథ్‌లు సూచించారు. మంగళవారం ఉపాధి క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ లక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం కొత్తపల్లి, గరుగుబిల్లి, రావుపల్లి పంచాయతీల్లో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు.

ఘనంగా బాల గణపతి విగ్రహ ప్రతిష్ఠ



అన్నప్రసాద వితరణలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివేకానంద కాలనీలో గల తారకరామా వీధిలో ఏర్పాటుచేసిన బాలగణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయం అందిస్తానని చెప్పారు. అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో గల ఏడు మద్యం దుకాణాలు, మూడు బార్లను ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ బార్ లోనూ, మద్యం దుకాణంలోనూ అదనంగా మద్యం సీసాలు దొరకలేదని తెలిపారు. మద్యం షాపుల్లో అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండాలని లైసెన్స్‌దారులకు, దుకాణాలకు ఆదేశించామన్నారు. అలా అందుబాటులో ఉంచని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం దుకాణాలకు సంబంధించిన సీసాలు బార్లలో ఉంటే ఆ బార్లుపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సోలార్ విద్యుత్తును వినియోగించుకోవాలి

సీతానగరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సోలార్ విద్యుత్తును వినియోగించుకోవాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ కె.కుమార్‌వర్మ తోపాటు ఎంపీడీవో పాల్గొని, మాట్లాడారు. మండల అధికారులకు, సచివాలయ సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటిపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి లబ్ధిదారులకు, రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్ పాపారావు వివరాలను తెలియజేశారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ జానకీరాం, ఏపీవో భాను పాల్గొన్నారు.

పెదబొండపల్లి భూముల విషయంలో పరస్పరం ఫిర్యాదులు

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెదబొండపల్లి గ్రామ సమీపంలో దళితుల భూములు ఆక్రమించుకున్న పరిస్థితిపై ఇటీవల ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అక్కడకు వెళ్లి పరిశీలించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఎమ్మెల్యే, ఆయన అనుచరులు గొట్టాపు వెంకట్‌నాయుడు, చుక్క అచ్యుత, వి.శ్రీనివాస్ తదితరులపై చుక్క శ్రీదేవి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ భూముల వద్దకు వెళ్లి నిర్మాణాలు తొలగించారని తదితర ఆరోపణలు చేస్తూ రూరల్ పోలీ సులకు ఆమె సోమవారం రాత్రి ఫిర్యాదు అందజేసింది. ఇదిలా ఉండగా.. తమ భూములను ఆక్రమించుకున్న శ్రీదేవిపై చర్యలు తీసుకోవాలని పెదబొండపల్లి గ్రామానికి చెందిన కె.మోహన్ తదితర దళితులు ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదులపై పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

● ఐటీడీఏ డీడీ అన్నదొర

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు రుచికరమైన భోజనం వండి పెట్టాలని డీడీ అన్నదొర ఆదేశించారు. మండలంలోని ముత్యాలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా స్టోర్‌రూంను పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీడీ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని హెచ్ఎం శ్రావణీని ఆదేశించారు. ఈ పరిశీలనలో డీడీతో పాటు ఏఎంవో కోటిబాబు తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో యగ్నిక్ ప్రతిభ

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్దూరు గ్రామానికి చెందిన ఆరిక యగ్నిక్ అనే ఆరేళ్ల విద్యార్థి అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఇటీవల విశాఖపట్నం పోర్టు స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న యగ్నిక్ మెరుగైన ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ బాలుడిని మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అభినందించారు. పీవోని కలిసిన వారిలో మాస్టర్ కోచ్ తోట సింహాచలం, కోచ్ ఆరిక సింహాచలంలు ఉన్నారు.



యగ్నిక్‌ను అభినందిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

బ్యూటీ థెరపిస్ట్ ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ

గుజరాతీపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీథెరపిస్ట్ ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు విశాఖపట్నంలోని ఆర్టీసీకాంపెక్స్‌లోని రెండోఅంతస్తులో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన 18 నుంచి 28 సంవత్సరాల విద్యార్థులు అర్హులని తెలిపారు. మూడు నెలలు అనుభవజ్ఞులైన శిక్షకులతో శిక్షణతోపాటు భోజన వసతి, యూనిఫారాలు, బుక్స్ ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలను కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం శ్రీకాకుళంలోని రాగోలు జెమ్స్ ఆసుపత్రిలోగల 7680945357, 9121999654 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పాలకొండలో యోగాసనాలు

పాలకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో రుషి యోగా కేంద్ర సభ్యుడు ధనుంజయ్ గురూజీ పిలుపు మేరకు సూర్య నమస్కారాలు, యోగాసనాలు వేశారు. అనంతరం యోగాపై నినాదాలు చేసుకుంటూ కార్గిల్ సెంటర్‌లో ఉన్న సూర్యదేవుని దర్శించుకున్నారు. యోగా సభ్యులు బొడ్డు రామ్మోహన్, రామారావు గురూజీ, జనార్ధన్‌గురూజీ, చెర్రీ శ్రీను పాల్గొన్నారు. వీరఘట్టంలో కోణార్క్ వాసు ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు చేశారు.



యోగాశనాలు వేస్తున్న దృశ్యం



ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

బిగ్గరగా చదవండి

భామిని, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రోజూ పిల్లలకు గట్టిగా చదివి వినిపిస్తే భయం పోతుందని హోలీ క్రాస్ సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. మంగళవారం మూలగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ బిగ్గర చదువు(రీడ్ ఎలవుడ్) దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు బొమ్మలు ఆధారంగా కథలు చెప్పడంపైన అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలతో పేపర్‌తో కిరీటాలు తయారు చేయించారు.

శ్మశాన వాటిక ఆక్రమణపై విచారణ

పూసపాటిరేగ, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికను ఆక్రమించేశారని తమ్మయ్యపాలెం గ్రామస్థుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ గోవింద్ స్పందించారు. సర్వేయరు గణపతిరావు, రెవన్యూ అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో వారు మంగళవారం శ్మశాన వాటికను పరిశీలించారు. సర్వే నెంబరు 112/5, 6 స్థలాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయని, అందులోనే శ్మశానవాటిక ఉండేదని గ్రామ స్థులు తెలిపారు. గతంలో ఎఫ్ఎంబీ ప్రాప్తికి తాము ఆ భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్నామని సదరు వ్యక్తులు వివరించారు. నాడు జిరాయితీగా ఉండటంతో రిజిస్ట్రేషన్ చేసుకున్నామని అధికారులకు తెలిపారు. అయితే నేడు ఈ భూమి డీ పట్టాగా ఉన్నట్టు సర్వేయరు తెలిపారు. సెటిల్‌మెంట్ రికార్డును అనుసరించి ప్రభుత్వ భూములుగా ఉన్నాయని చెప్పారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిక అందజేస్తానన్నారు.

రక్తహీనతపై అవగాహన కల్పించాలి

మక్కువ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత నివారణపై అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని శంబర పీహెచ్‌సీని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్యపరమైన సమస్యలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న డీవార్మింగ్ కార్యక్రమానికి తగు ప్రణాళికలు సిద్ధం చేసు కోవాలని సూచించారు. అనంతరం శంబర జాతరలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ మక్కువ, శంబర పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.